# ఎర్రజెండాను రక్షించుకుంటాం

## పశ్చిమబెంగాల్ వీరగాథలు

బృందాకరత్



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# ఎర్రజెండాను రక్షించుకుంటాం

## పశ్చిమబెంగాల్ వీరగాథలు

బృందాకరత్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

108690

ప్రచురణ సంఖ్య : 1348

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2015

వెల : ₹ 40/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్ - తెలంగాణ**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

బ్రాంచీలు

హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.

నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


ముందుమాట ........................................................ 7

పరిచయం ........................................................ 9

**నాదియా**

భూ సమస్యపై పోరాటాలు .................................................. 11

**ఉత్తర 24 పరగణాల జిల్లా**

చేపల చెరువుల దగ్గర ప్రతిఘటన ............................................ 23

**బర్ద్వాన్**

రాజకీయ హింసాకాండకు ప్రతిఘటన ........................................ 35

**హుగ్లీ**

సాహసగాథలు ...................................................... 45

**బంకురా**

మండీ గ్రామ పోరాటయోధులు ............................................. 55

**దక్షిణ 24 పరగణాలు**

పంచాయతీల రక్షణలో ప్రతిఘటన ............................................. 61

**హౌరా**

రాజకీయంగా లోబరుచుకునేందుకు అత్యాచారం ఒక సాధనంగా............ 73

**తూర్పు మేదినీపూర్**

సాహసికులైన ఐసిడిఎస్ మహిళా కార్మికులు .................................. 81

**పశ్చిమ మేదినీపూర్**

"నేను సాల్ఖా సోరెన్" ........................................................... 99

**పశ్చిమ బెంగాల్ విద్యార్థులు**

ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాటం ....................................... 107

# ముందుమాట

ప్రస్తుతం పశ్చిమబెంగాల్ పౌరులు అతి క్లిష్టమైన రాజకీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. 2011 అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ పూర్తి మెజారిటీ సంపాదించిన నాటి నుంచి ఇది ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజే పశ్చిమ మిడ్నపూర్‌లో సిపిఐ(ఎం) కార్యకర్త కామ్రేడ్ జితేన్ నందిని తృణమూల్ గూండాలు హత్య చేశారు. ఆమరుసటి రోజు బర్ద్వాన్ జిల్లాలో మహిళా కార్యకర్త పూర్ణిమా ఘరోయ్ దారుణ హత్యకు గురయ్యారు.

రోజులు గడిచే కొలదీ హంతక దాడులతో పాటు ప్రజాస్వామ్యంపై దాడి పెరుగుతోంది. జనాభాలోని వివిధ తరగతుల ప్రజాస్వామిక హక్కులు తీవ్రంగా హరించబడుతున్నాయి. గూండాలు తృణమూల్ మద్దతుతో ప్రత్యేకించి మహిళలను లక్ష్యంగా చేసుకొన్నారు. అనేక ప్రాంతాలలో వారు భిన్న వయసుల మహిళలను అపహరించటం, అత్యాచారాలు తరువాత హత్య వంటి నేరపూరిత, అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు. ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలకు వ్యతిరేకంగా రాజకీయ ప్రేరితమైన హింసాకాండ జరుగుతున్నది. సిపిఐ(ఎం) సానుభూతిపరురాలైన ఒక మహిళ వక్షోజాలను కోయటం వంటి దారుణాలకు సైతం పాల్పడ్డారు.

పశ్చిమబెంగాల్ అన్ని జిల్లాల్లోని భిన్న తరగతుల పైన, అసమ్మతి తెలిపిన ప్రత్యర్థులందరిపైన తృణమూల్ కాంగ్రెస్ హింసాకాండ కొనసాగిస్తున్నది. అయినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ సంఘ వ్యతిరేక చర్యలకు గణనీయమైన సంఖ్యలో మహిళలతో సహా ప్రతిఘటన ప్రారంభించారు. తృణమూల్ కాంగ్రెస్ అసాంఘిక ముఠాలకు వ్యతిరేకంగా క్రమంగా నిరసన ప్రదర్శనలు, దాడులను ప్రతిఘటించటం గమనించాల్సిన అంశం.

అనేక ప్రాంతాలలో సామూహిక ప్రతిఘటనలలో మహిళలు ముందు పీఠీన ఉంటున్నారు. బెంగాలీ సమాజంలో సుపరిచితులైన మాజీ వైస్ ఛాన్సలర్లు, విశ్రాంత న్యాయమూర్తులతో సహా అనేక మంది ప్రజల ప్రజాస్వామిక హక్కులు, సూత్రాలను పునరుద్ధరించాలని వీధుల్లోకి వచ్చి డిమాండ్ చేస్తున్నారు.

ఈ పుస్తకంలో అనేక మంది సాహసోపేత స్త్రీ, పురుషుల ప్రతిఘటన స్వరాలను మనం వినవచ్చు. భయంకరమైన హింసాకాండను వారెలా భరించారు, తిరిగి ఎలా ప్రతిఘటించారో కూడా మనం తెలుసుకోగలం. సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు కామ్రేడ్ బృందాకరత్ ప్రతి జిల్లాను సందర్శించారు, బాధితులు లేదా వారి కుటుంబాలను కలుసుకున్నారు, ఎంతో శ్రమకోర్చి వారి అనుభవాలను నమోదు చేశారు. ఈ గాథలను చదివితే, ఆ స్త్రీ, పురుషులు మనతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్న అనుభూతి కలుగుతుంది. వారి దీక్ష నిజంగా మనలను కదిలించుతుంది. బాధితుల అసమాన ధైర్యం, ఎర్రజెండా పట్ల వారి నిబద్ధతను చూసి నేనెంతో చలించిపోయాను.

ఈ గాథలను చదవటం ద్వారా దేశ ప్రజలు ప్రత్యేకించి మహిళలు పశ్చిమబెంగాల్‌లో మారిన రాజకీయ రంగంలో ఏం జరుగుతోందో ఒక అవగాహనకు వస్తారని నేను విశ్వసిస్తున్నాను. ప్రస్తుత పశ్చిమబెంగాల్ తీరుతెన్నులను అర్థం చేసుకోవటానికి కూడా ఈ పుస్తకం ఉపకరిస్తుందని, బహుళ ఆదరణ పొందుతుందని ఆశిస్తున్నాను.

**- బిమన్ బాసు**

**భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు**

**మరియు**

**పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి**

# పరిచయం

ఈ ప్రచురణ పశ్చిమబెంగాల్ ప్రతిఘటన స్వరాలను మీ ముందుంచుతుంది. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక విధాలుగా, అనేక రూపాల్లో సాగుతున్న భయోత్పాతం, హింసాకాండను దేశంలోని వామపక్ష మద్దతుదార్లు, స్నేహితులు అవగతం చేసుకోవటం కష్టం. అఖిల భారత స్థాయిలో మరియు పశ్చిమబెంగాల్‌లోని విశాలమైన రాజకీయ అంశాలు, పరిణామాలు ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి నెలకొనడంలో నిర్ణాయక పాత్ర వహిస్తున్నాయన్నది నిస్సందేహం. ఈ అంశాలను ఇప్పటికే వెలువడిన అనేక నివేదికలు, రచనలు విశ్లేషించాయి. హింసాత్మక సంఘటనల గురించి ఎప్పటి కప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వివరణాత్మ నివేదికలు మరియు ప్రచురణలను తెచ్చింది. పశ్చిమబెంగాల్‌లో వామపక్ష ఉద్యమం, దాని ప్రత్యామ్నాయ రాజకీయాలను పరిరక్షించుకొనే పోరాటంలో ముందు పీఠిన ఉన్న కొన్ని గ్రామాల మరియు వ్యక్తుల గాథలను ఈ సంకలనంలో తెలుసుకోవచ్చు. 2014 ఆగస్టు – అక్టోబరు మాసాల మధ్య అనేక ఇంటర్వ్యూలలో బాధితులు స్వయంగా చెప్పిన అంశాలివి.

ఈ దాడులను రాజకీయ ప్రత్యర్థుల మధ్య సాగుతున్న యుద్ధంగా కార్పొరేట్ మీడియా చిత్రించటం ఎంత బూటకమో ఈ కథనాలు బహిర్గతం చేస్తాయి. బాధితులు ఎదుర్కొన్న దాడులలో స్పష్టమైన వర్గకోణం ఉంది. భూ సంస్కరణలు, నీటి వనరుల పునఃపంపిణీ, కార్మికవర్గ హక్కుల రక్షణ, పంచాయతీ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణ, దారుణమైన కులవ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన విజయవంతమైన పోరాటం, రాజీలేని లౌకికతత్వ పరిరక్షణ, గ్రామీణ బెంగాల్‌లోని పేదలకు అనుకూలంగా బలాబలాల పొందిక మొగ్గేట్లు చూడటం వంటి వామపక్ష సంఘటన విజయాలను ఈ గాథలు వెల్లడిస్తాయి.

ఈ విజయాలను తిరగదోడటానికి, వనరులు, అధికారాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ప్రస్తుత పాలకులు చేస్తున్న యత్నాలకు బెంగాల్‌లోని పది జిల్లాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలకు సంబంధాన్ని ఈ గాథలు వెల్లడిస్తాయి.

నాడియా జిల్లాలోని తెహట్టా గాథలు తృణమూల్ మద్దతుతో మాజీ జమిందారు భూ సంస్కరణలను వమ్ము చేసేందుకు చేసిన ప్రయత్నాలు వెల్లడిస్తాయి. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హరోవా గాథ, భేరీ సహకార సంస్థపై ఇలాంటి లక్ష్యంతోనే జరిగిన దాడి, బ్రాహ్మన్‌చౌక్ మహిళల ధీరత్వాన్ని వివరిస్తుంది. ఒకదాని తరువాత ఒకటిగా జిల్లా పంచాయతీ వ్యవస్థలను నేర, అవినీతిమయం కావిస్తున్నారో దక్షిణ 24 పరగణా జిల్లా గాథలలో చూడవచ్చు. బర్ద్వాన్, బంకూరా, హుగ్లీ, తూర్పు, పశ్చిమ మిడ్నపూర్ జిల్లాల్లో మౌలిక ప్రజాస్వామిక హక్కులపై జరుగుతున్న దాడులకు ప్రతిఘటన స్వరాలు ఇందులో ఉన్నాయి. రాజకీయంగా లొంగదీసుకొనేందుకు అత్యాచారాన్ని ఆయుధంగా ఎలా చేసుకున్నారో, దానికి ప్రతిఘటన ఎలా ఎదురైందో హౌరా నుంచి ఒక గాథ మనకు సజీవంగా వివరిస్తుంది. చివరి అధ్యాయంలో విద్యా సంస్థలలో ప్రజాస్వామ్యంపై దారుణ దాడులు మరియు ఒక విద్యార్థి నాయకుడు ఎలా అమరజీవి అయింది చూస్తాము. ఈ గాథల్లోని దాడులు మరియు ప్రతిఘటన పశ్చిమ బెంగాల్లో ఈ రోజు ఏం జరుగుతోందన్నదాన్ని పాఠకుల కళ్ళకు కడుతుంది. ఈ గాథలు ప్రచురితం కావటానికి తోడ్పడిన వారందరికీ ప్రచురణ కేంద్ర బృందం కృతజ్ఞతలు తెలుపుతోంది. బెంగాల్లోని జిల్లా కమిటీ నాయకులకు, మినతీ ఘోష్, అంజుకార్, రేఖా గోస్వామి మరియు రమా బిస్వాస్ వంటి రాష్ట్ర స్థాయి అనేక మందికి కృతజ్ఞతలు తెలుపుతోంది.

# నాదియా

## భూ సమస్యపై పోరాటాలు

1977-2011 సంవత్సరాల మధ్య పశ్చిమబెంగాల్లో వామపక్ష సంఘటన ప్రభుత్వం భూమి లేని పేదలకు ఆశ్చర్యకరమైన రీతిలో భూ పంపిణీ చేసింది. మరొకరు అధిగమించలేని రికార్డు అది. దేశం మొత్తం పంపిణీ చేసిన భూమిలో ఒక్క వామపక్ష సంఘటన హయాంలోనే 22.6శాతం భూమి పంపిణీ అయింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చిన తరువాత గత మూడు సంవత్సరాలలో ఇంతవరకు ఎలాంటి భూ పంపిణీ జరగలేదు. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పేరుకు భూదాన కార్యక్రమాలను ప్రకటించటం మాత్రమే జరిగింది. వామపక్ష సంఘటన ప్రభుత్వం అలాంటి ఆర్భాటం చేసి భూ పంపిణీని నీరుగార్చలేదు. భూపంపిణీని, భూమికోసం జరిగిన పోరాటాలకు అనుసంధానం చేసి వాస్తవ రూపం దాల్చేట్లు చేశారు. వామపక్ష సంఘటన మద్దతుతో కిసాన్‌సభ నాయకత్వంలో ఈ భూపోరాటాలలో రైతాంగాన్ని సంఘటిత పరిచారు. గ్రామీణ బెంగాల్లో వర్గ సంబంధాలలో పేదలు, భూమిలేని వారికి అనుకూలంగా గణనీయమైన మొగ్గు తెచ్చారు. పన్నెండు లక్షల మిగులు భూములను పేదలకు పంచి పట్టాలు జారీ చేశారు. దీనిలో లక్షా 79వేల ఎకరాలకు సంబంధించి భూస్వాముల లిటిగేషన్, కోర్టుల స్టే ఆర్డర్ల కారణంగా పట్టాల బదిలీ నిలిచిపోయింది. అయినప్పటికీ వామపక్ష ప్రభుత్వ స్పష్టమైన విధానం కారణంగా పేదల అనుభవంలో ఉన్న భూములను వెనక్కు తీసుకొనేందుకు భూస్వాములు సాహసం చేయలేకపోయారు. ఒక్క బెంగాల్లో మాత్రమే భూస్వాములకు చట్టవిరుద్ధంగా సాయపడకుండా, భూములను స్వాధీనం చేసుకోకుండా పోలీసులను నిలువరించగలిగారు. ఈ భూ సంస్కరణల విధానం కూడా బెంగాల్ గ్రామసీమల్లో కులం, కొంతమేరకు లింగసమానత్వం వంటి సామాజిక సంబంధాలపై కూడా ప్రభావం చూపింది. భూమి పొందిన వారిలో దాదాపు

37 శాతం మంది షెడ్యూలు కులాలు, 18శాతం షెడ్యూలు తెగలకు, 18 శాతం మైనారిటీలకు చెందిన వారున్నారు. ఆరు లక్షలకు పైగా భార్యా భర్తల పేరుతో సంయుక్త పట్టాలను జారీ చేశారు. మరో లక్షా 60వేల పట్టాలను కేవలం మహిళల పేరుతోనే ఇచ్చారు. గతంలో అణిగి మణిగి ఉండే సంబంధాల స్థితిలో ఇది మార్పు తెచ్చింది. అణచివేతకు గురైన కులాల్లో ఎర్ర జెండా ఎంతో విశ్వాసాన్ని నింపటంతో అంతకు ముందు మాదిరి ఇంకేమాత్రం కులం బలం ప్రదర్శించలేకపోయింది. అణచబడిన కులాలకు ఉపాధి, భాగస్వామ్య అధికారం కల్పించిన విప్లవాత్మక భూపంపిణీ కార్యక్రమంతో పాటు, మూడంచెల పంచాయతీ వ్యవస్థ మరింత బలోపేతమై సానుకూల మార్పులు తెచ్చింది. దీనికి తోడు బర్గాదార్లు లేదా కౌలుదార్లుగా ఉన్న వారికి రక్షణగా, వారిని తొలగించకుండా చట్టాలను సవరించి వామపక్ష సంఘటన ప్రభుత్వం దేశంలోనే అతి పెద్ద కార్యక్రమాన్ని అమలు జరిపింది. తద్వారా పదిహేను లక్షల మందికి చట్టబద్ధమైన హక్కులు వచ్చాయి. వారి పేరున 11లక్షల ఎకరాల కౌలు భూమి నమోదైంది. మరో ఐదున్నర లక్షల మందికి భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు ఇవ్వబడ్డాయి. ఈ మూడు పథకాల వలన 50లక్షల మంది లబ్ది పొందినట్లు భూ సంస్కరణల కార్యక్రమ ఫలితాల గురించి 2008లో శాసనసభలో చేసిన ప్రకటన వెల్లడించింది. తృణమూల్ కాంగ్రెస్ 2011లో అధికారానికి వచ్చిన తరువాత రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో పాత భూస్వాములు తిరిగి సంఘటితం కావటం ప్రారంభించారు. చట్టపరమైన కారణాలతో భూ పట్టాలు పంపిణీ కాని ఉదంతాలలో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసి భూమిని తిరిగి తమకు అప్పగిస్తుందనే ఆశతో వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. తృణమూల్ సర్కార్ హయాంలో పోలీసులు మళ్ళీ గ్రామీణ పెత్తందారులు, భూస్వాముల కొమ్ముకాస్తున్నారు, వామపక్ష సంఘటన ప్రభుత్వ హయాంలో భూములు పొందిన వారిని బలవంతంగా తొలగించే పథకాల్లో భాగస్వాములౌతున్నారు. అయితే తృణమూల్ గూండాలు, పోలీసుల హింసాకాండ, బెదిరింపులు కొనసాగుతున్నప్పటికీ పేదలు, కిసాన్ సభ మరియు సిపిఐ(ఎం) కార్యకర్తలు పునస్సంఘటితమవుతున్నారు. ఉదాహరణకు నాడియా జిల్లాలోని తెహట్టాకు చెందిన మూడు గాథలలో వర్ణించినట్లుగా ప్రతిఘటనకు పూనుకుంటున్నారు.

## పరాధీన భూముల కోసం పోరాటం

బంగ్లాదేశ్ సరిహద్దులలో ఉన్న నాడియా జిల్లాలో తెహట్టా రెవెన్యూ డివిజన్ ఉంది. దీనిలో తెహట్టా-1, తెహట్టా-2, కరీంపూర్ అనే మూడు సమితులున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికలలో ఈ డివిజన్‌లోని మూడు నియోజకవర్గాలలో సిపిఎం అభ్యర్థులు విజయం సాధించారు. ఈ జిల్లాలో పెద్ద సంఖ్యలో నామశూద్రులు అనే షెడ్యూలు కులానికి చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌గా పిలువబడుతూ పాత తూర్పుపాకిస్థాన్ నుంచి తొలుత 1950 దశకంలో, తరువాత 1965లో భారత్-పాక్ యుద్ధం సందర్భంగా, మూడవ సారి 1971లో బంగ్లాదేశ్ విడిపోయినపుడు మూడు దఫాలుగా నిర్వాసితులుగా వచ్చారు. ఈ ప్రాంతంలోని భూములన్నీ బడా భూస్వాముల చేతుల్లో ఉండేవి. వారు భూములకు దూరంగా ఉండేవారు. వాటిని కౌలుదార్లు సాగు చేసేవారు. పైన పేర్కొన్న నిర్వాసితులు కొంత మంది కౌలుదార్లుగా మరికొందరు భూస్వాముల భూముల్లో కూలీలుగా స్థిర పడ్డారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కౌలుదార్లు, వ్యవసాయ కూలీల పోరాటాల ఫలితంగా వారికి 1960దశకం చివర్లో ఇండ్ల స్థలాలు ఇచ్చారు. పెద్ద భూస్వాములలో ఒకడైన అమియా దత్తాకు బేటాయ్, దేవనాథ్‌పూర్, నాత్నా పంచాయతీలలో 700 బీగాల భూమి ఉంది (ఒక ఎకరానికి 1.6 బీగాలు). 1969 భూ పోరాటాల సమయంలో ఈ మూడు గ్రామాలలోని పేదలు కొంత భూమిని ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్నారు. 1972లో ఎన్నికల రిగ్గింగు చేసి అధికారానికి వచ్చిన సిద్దార్థ శంకరరాయ్ ప్రభుత్వ పోలీసుల సాయంతో భూస్వామి వాటిని కూలగొట్టి భూమిని ఆక్రమించుకొన్నాడు. భూ సీలింగ్ చట్టం నుంచి భూస్వామిని కాపాడేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బినామీ పేర్లతో పట్టాలను జారీ చేసి భూస్వామికి భూమిని కట్టబెట్టింది. రెండువందల యాభై పేద కుటుంబాలను తొలగించి, ప్రతిఘటించిన వారిని తప్పుడు కేసులలో ఇరికించి పోలీసులు జైలుపాలు చేశారు. కొంతమంది తిరిగి భూస్వాముల కౌలుదార్లుగా మారారు. 1977లో వామపక్ష ప్రభుత్వం ఏర్పడిన తరువాత భూపోరాటానికి ఊపువచ్చింది. గతంలో తొలగింపునకు గురైన నామశూద్ర కుటుంబాలు తిరిగి భూమిని ఆక్రమించుకున్నాయి. గతంలో భూస్వాములకు సాయం చేసిన పోలీసులను ఈ సారి దూరంగా ఉండాలని వామపక్ష ప్రభుత్వం ఆదేశించింది. ఈ వైఖరి భూ పోరాటాన్ని మలుపు తిప్పింది. తమ చట్టవిరుద్ధ చర్యలకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకొనే అవకాశం పోయిందని గ్రహించిన భూస్వాములు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. మూడు వందల మంది షెడ్యూలు కులాల కుటుంబాలకు వామపక్ష ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. కమతాలు చిన్నవైనప్పటికీ వాటిని ఒక ఆదాయ వనరుగా చేసుకొని కూరగాయలు, అరటి వంటి పంటలను సాగు చేసుకున్నారు. పిల్లలను స్కూళ్లకు పంపారు. ఆ ప్రాంతంలో శాంతి నెలకొన్నది.

అయితే 2011లో అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. కాని తెహట్టాలోని మూడు స్థానాలలో మాత్రం ఓడిపోయింది. వాటిలో ఒక నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా తృణమూల్ అధ్యక్షుడు మాజీ భూస్వామి అమియ దత్తా కుమారుడు గౌరీశంకర్ దత్తా. ఆ ప్రాంతంలో అవాంఛనీయ కార్యకలాపాలలో పేరు మోసిన గౌరీ శంకర్ ఎన్నికలలో పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయటమేగాక బెదిరింపులకు దిగినప్పటికీ ఫలితం దక్కలేదు. సిపిఎం అభ్యర్థి రంజిత్ మండల్ చేతిలో ఓడిపోయాడు. పేదల అనుభవంలో ఉన్న భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్న గౌరీ శంకర్ స్థానిక గూండాలు, పోలీసుల సాయం తీసుకున్నాడు. అతనికి మరికొందరు భూస్వాములు తోడయ్యారు. వారిలో గోపాల్ సర్కార్ ఒకడు. అతని తండ్రి శరత్ సర్కార్ తన పేరు పెట్టాలనే షరతుతో స్థానిక పాఠశాల నిర్మాణానికి కొంత భూమిని దానంగా ఇచ్చాడు. పేదల హక్కులను నిరాకరించాడు. ఈ ప్రాంతంలో భయానకవాతావరణం సృష్టించారు. పోలీసులు ఈ సారి వారి వైపే ఉన్నారు. 2011 నుంచి 2014 వరకు చిన్న రైతులు, భూమిలేని పేదలు వేధింపులకు గురయ్యారు. తృణమూల్ గూండాలు రాత్రుళ్లు దాడి చేసి ఇంటి పరిసరాల్లో ఉన్న వెదురు, అరటి, బొప్పాయి చెట్లను, ఇతర చెట్లను నరికి వేశారని బేటాయ్ గ్రామస్తురాలు కరుణా సర్కార్ వివరించారు. 'ఎలాంటి హెచ్చరికలు లేకుండా నిశ్శబ్దంగా దాదాపు 30 మంది నా భూమిలో ప్రవేశించి నేను నాటి పెంచిన, మంచి ఆదాయమిచ్చే ఒక పెద్ద చెట్టును నరికివేయటం ప్రారంభించారు. వెంటనే నేనూ, నా భర్త వెళ్లి ఆపాలని కోరాము. 'ప్రభుత్వమూ మాదే, చెట్టూ మాదే' అంటూ వారు మమ్మల్ని దారుణంగా కొట్టారు. ఇది చట్ట విరుద్ధమని అభ్యంతరం పెట్టాను. మాకు లాఠీతో పని తప్ప మరొక చట్టం తెలియదంటూ మళ్లీ కొట్టారు. తరువాత పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాము. అక్కడ వారూ అదే భాషను ఉపయోగించారు. 'మీరు 34 సంవత్సరాల పాటు తిన్నారు కదా ! ఇప్పుడు మీ రాజ్యం పోయింది' అని



ఎగతాళి చేశారు. పేదలు తినకూడదా, ఎందుకు పేదల నోటికాడి దానిని లాక్కుంటారు అని అడిగాను నేను. కానీ వారు  మా ఫిర్యాదును స్వీకరించలేదు.'

కరుణా సర్కార్ పొరుగింటి మహిళ ప్రభావతి మండల్ తన కథను ఇలా చెప్పింది, 'తృణమూల్ గూండాలు మా ఇంటికి వచ్చి ఇది మా భూమి ఖాళీ చేయాలంటూ బెదిరించారు. నాకు పట్టా ఉందని చెప్పగానే వారు పెద్ద పెట్టున నవ్వి వెంటనే నన్ను, నా కుమార్తెను కొట్టటం ప్రారంభించారు. మేం ఇంటి నుంచి వెళ్లిపోయేందుకు నిరాకరించాం. తరువాత మమ్మల్ని కొట్టిన వాళ్లు నాపై తప్పుడు కేసు పెట్టారు. ఆ రాత్రి పోలీసులు నన్ను అరెస్టు చేసి మూడు రోజుల పాటు లాకప్పులో పెట్టారు. ఆ సమయంలో గూండాలు నా స్థలంలోని మూడు చెట్లు నరికివేసి ఇతర మొక్కలను నాశనం చేశారు. నా ఫిర్యాదును స్వీకరించేందుకు పోలీసులు తిరస్కరించారు. తరువాత తృణమూల్ నాయకులు నా దగ్గరకు వచ్చి మా పార్టీలో చేరు నీ భూమి గురించి రాజీ చేస్తామని చెప్పారు. నేను చావనైనా ఛస్తాను గాని మీతో చేరేది లేదని చెప్పాను. ఈ రోజు నేను ఎర్ర జెండా సాయంతో నా కేసుపై పోరాడుతున్నాను.'

ఇంతలో 70 ఏళ్ల వితంతువు గురుదాసి మండల్ తన అనుభవాన్ని ఇలా వివరించింది.'ఇళ్లలో పనిచేస్తూ నా పిల్లలను పెంచి పెద్ద చేశాను...వామపక్ష ప్రభుత్వ హయాంలో పంచాయతీవారు పక్కా గదులు, మరుగుదొడ్డితో సహా నిర్మించిన ఇల్లుంది. ఒక రోజు తృణమూల్ వారు  దానిని ఆక్రమించారు. తరువాత నా కోడలిపై తప్పుడు కేసులు పెట్టి మమ్మల్ని వేధిస్తున్నారు' అని చెప్పింది.

పొరుగునే ఉన్న పంచాయతీ నాత్నాలో పేరు మోసిన పెద్ద మోతుబరి అమియ దత్తా నుంచి తమ భూములను రక్షించుకొనేందుకు పేదలు మూడు సంవత్సరాలుగా పోరాడుతున్నారు. వారిలో ఒకరైన దులాల్ సర్కార్ గొంతు విప్పాడు.' ఇలయాచీ బోరల్, హరేన్ ముందు, ధీరేన్ బిస్వాస్ వంటి పట్టాదారులు భూమి తమ ఆధీనంలో ఉన్నట్లు తమకు అనుకూలంగా కోర్టు ఉత్తరులు కూడా తెచ్చుకున్నారు. వాటిని అమలు జరిపేందుకు పూనుకున్న ప్రతిసారీ వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ తృణమూల్ నాయకులు పోలీసులను ఉసిగొల్పుతున్నారు.' ... 'కోర్టు నాకు అనుకూలంగా ఉత్తరువు ఇచ్చినప్పటికీ సాయం చేసేందుకు పోలీసులు తిరస్కరిస్తూ ఐదువేల రూపాయలు లంచం ఇవ్వాలని వత్తిడి చేసినట్లు లక్ష్మీకాంత మండల్ వివరించాడు. భూస్వాములు మమ్మల్ని పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిప్పుతూ మేము సాగు చేసిన భూమిని కాజేయాలని చూస్తున్నారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Yerrajendanu+Rakshinchukuntam](http://kinige.com/book/Yerrajendanu+Rakshinchukuntam)**

* * *